
సాక్షి
వనపర్తి
బుధవారం । 1 । అక్టోబర్ । 2025



సిద్ధిధాత్రి.. కరుణించమ్మా

జోగుళాంబ అమ్మవారిని మంగళవారం సకల సిద్ధులు ప్రసాదించే సిద్ధిధాత్రిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

-10లో ▸



స్వల్పంగా తగ్గిన వరద

జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద మంగళవారం స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

-10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.1 /22.1

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత కాస్త కనిపిస్తుంది. చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

ఘనంగా దుర్గాష్టమి వేడుకలు



జిల్లాకేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో దుర్గాదేవిగా అమ్మవారు

వనపర్తిటౌన్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లాకేంద్రంలోని రామాలయం, వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం, అయ్యప్ప, చౌడేశ్వరి ఆలయాల్లో అమ్మవార్లను దుర్గాదేవిగా అలంకరించి పూజించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా.. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

న్యూస్‌రీల్

విజయదశమి.. విజయాలు చేకూర్చాలి



గోపాల్‌పేట: విజయదశమి నియోజకవర్గ ప్రజలందరికీ విజయాలు చేకూర్చాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రంతో పాటు ఏదుల, రేవల్లి మండలాల్లోని దుర్గామాతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాబోయే రోజుల్లో ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు. ఆయా గ్రామాల్లో పార్టీ కార్యకర్తలతో మాట్లాడి పరిస్థితులపై ఆరా తీశారు. ఆయన వెంట ఉమ్మడి మండలాల కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి, గోపాల్‌పేట పట్టణ అధ్యక్షుడు శివన్న, రేవల్లి మండల అధ్యక్షుడు పర్వతాలు, ఉమ్మడి మండల నాయకులు ఉన్నారు.


‘ఖిల్లా’లో దంచికొట్టిన వాన



ఖిల్లాఘనపురం: మండలంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెక్‌డ్యాంలు నిండి మత్తడి దూకాయి. మండలంలోని పలుగ్రామాల మీదుగా పారే పెద్ద వాగుకు భారీగా వరద చేరింది. మండల కేంద్రంలో విజయ్‌కుమార్ పాత ఇల్లు కూలింది. అప్పారెడ్డిపల్లి మత్రి చెరువుకు నీరు అందించే కాల్వకు గండిపడటంతో పంటల్లోకి నీరు చేరింది. పత్తి తదితర పంటలు దెబ్బతిన్నాయి.

అయ్యో.. అయ్యయ్యో!

‘స్థానిక’ రిజర్వేషన్లలో పంచాయితీ



ఎస్సీలు లేని చోట ఎస్సీలకు.. ఎస్టీలు లేని చోట ఎస్టీలకు.. ఇలా ‘స్థానిక’ ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారు చేయడం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా పలు గ్రామాల్లో సర్పంచ్, వార్డు పదవులకు కేటాయించిన రిజర్వేషన్లలో ఆ వర్గానికి చెందిన ఓటర్లే లేకపోవడంతో గందరగోళం నెలకొంది. మరోవైపు కొన్ని పల్లెల్లో ఒకరు, ఒకట్రెండు కుటుంబాలు ఉన్న సామాజిక వర్గాలకు అనివార్యంగా పదవులు దక్కనున్నాయి. ఇదేక్రమంలో ఎన్నో ఆశలతో బరిలో నిలిచేందుకు గ్రౌండ్ ప్రిపేర్ చేసుకున్న వివిధ పార్టీల్లోని ముఖ్య నేతల అనుచరులకు భంగపాటే ఎదురైంది. తారుమారైన రిజర్వేషన్లు దేవరకద్రతో పాటు అన్ని నియోజకవర్గాల్లోనూ ఆయా నాయకుల ఆశలపై నీళ్లు చల్లగా.. వారిలో నైరాశ్యం అలుముకుంది.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

- ఎస్టీలు లేని చోట ఎస్టీకి.. ఎస్సీలు లేని చోట ఎస్సీకి..
- పలు గ్రామాల్లో కిరికిరి.. కొన్ని చోట్ల అనివార్యంగా పదవులు
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆ 4 గ్రామాల్లో ‘ప్రత్యేక’ పరిస్థితి
- ఎస్టీలు లేకున్నా సర్పంచ్ స్థానాలు ఆ వర్గానికే రిజర్వ్‌డ్
- 2019లో జరగని ఎన్నికలు.. ఈ సారీ స్వయం పాలనకు దూరమేనా..?

ఎక్కడెక్కడ.. ఎలా అంటే..

■ నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం మన్నాపూర్‌లో 2011 లెక్కల ప్రకారం జనాభా 1,200. ఇందులో ఎస్సీ జనాభా 189 కాగా.. ఇతరులు 1,011. మొత్తం ఎనిమిది పంచాయతీ వార్డులు ఉన్నాయి. 2019 మొదటి సాధారణ ఎన్నికల్లో ఏడో వార్డు ఎస్సీలకు కేటాయించారు. రొటేషన్ పద్ధతి కావడంతో ప్రస్తుత (2025) స్థానిక ఎన్నికలకు సంబంధించి ఆ వార్డును వదిలేశారు. ఆ తర్వాత ఎస్సీ రిజర్వేషన్ ఖరారులో భాగంగా మిగిలిన ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఎనిమిది వార్డులకు అధికారులు అఖిలపక్ష సమావేశంలో డిప్ తీశారు. ఇందులో ఆరో వార్డు రాగా.. దీన్ని ఎస్సీ రిజర్వేషన్ కేటాయించారు. అయితే ఈ వార్డులో ఒక్క ఎస్సీ ఓటరు కూడా లేడు.

■ జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం బోరవెల్లి గ్రామ జనాభా 3 వేల వరకు ఉంటుంది. ఈ పంచాయతీలో మొత్తం 12 వార్డు స్థానాలు ఉన్నాయి. ఇందులో గత పంచాయతీ ఎన్నికల్లో 11, 12 వార్డులు ఎస్సీ రిజర్వేషన్ కాగా.. ఈ సారి ఒకటి, పదో వార్డులను ఎస్సీ రిజర్వేషన్ కింద కేటాయించారు. ఈ వార్డుల్లో ఒక్క ఎస్సీ ఓటరు కూడా లేరు.

ఆ 4 గ్రామాలకు మళ్లీ అదే దుస్థితి..

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని కల్ములోనిపల్లి, కుమ్మరోనిపల్లి, వంగురోనిపల్లి, ప్రశాంత్‌నగర్ గ్రామ సర్పంచ్ స్థానాలు ఎస్టీ మహిళకు రిజర్వ్ అయ్యాయి. కానీ ఈ గ్రామాల్లో ఎస్టీ కుటుంబాలు లేవు. గత ఎన్నికల్లో ఈ గ్రామ సర్పంచ్ స్థానాలు ఎస్టీ రిజర్వ్‌డ్ కాగా.. ఆ వర్గానికి చెందిన వారు ఎవరూ లేకపోవడంతో ఎన్నికలు జరగలేదు. ప్రత్యేకాధికారుల పాలనలోనే కాలం గడిచింది. ఈ సమస్య పరిష్కారం కోసం ఆయా గ్రామాల నాయకులు ఎన్నో సార్లు వినతులు ఇచ్చినా.. ఫలితం లేకుండాపోయింది. ఇప్పుడు కూడా ఆయా గ్రామాల సర్పంచ్ స్థానాలు ఎస్టీ రిజర్వ్‌డ్ కావడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఈ సారి సైతం సర్పంచ్‌లు లేని గ్రామాలుగా మిగిలిపోయే అవకాశం ఉంది.

ఒకే ఒక్క బీసీ ఓటరు.. ఆమెకే లక్కీచాన్స్..

మహబూబ్‌నగర్ జిల్లా మహబూబ్‌నగర్ రూరల్ మండలం మాచన్‌పల్లి తండా పంచాయతీ పరిధిలో అన్నీ గిరిజన కుటుంబాలే. మొత్తం జనాభా 999 కాగా.. ఇందులో మహిళలు 499, పురుషులు 500. వీరిలో మహిళలు, పురుషులు కలిపి మొత్తం ఓటర్లు 975 మంది. అయితే ఈ పంచాయతీ సర్పంచ్ స్థానం బీసీ మహిళకు రిజర్వ్ అయింది. తండాకు చెందిన నారాయణ అనే యువకుడు బీసీ వర్గానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకోగా.. ఆమె ఒక్కరే బీసీ ఓటరుగా జాబితాలోకి ఎక్కింది. సర్పంచ్ స్థానం బీసీ మహిళకు రిజర్వ్ అయిన నేపథ్యంలో అక్కడ ఆమె ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంది.

■ మహబూబ్‌నగర్ రూరల్ మండలం చౌదర్‌పల్లి గ్రామంలో ఏడో వార్డులో మొత్తం 40 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో మూడు కుటుంబాలు ఎస్సీ వర్గానికి చెందిన వారు కాగా.. మిగతా అందరూ బీసీలే. ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో ఆ వార్డు ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది. అయితే ఇప్పటివరకు ఆయా కుటుంబాలకు చెందిన వారు ఎవరూ రాజకీయాల్లో లేరు. పార్టీ గుర్తులపై జరిగే ఎన్నికలు కాకున్నా.. వారిని తమ వైపునకు తిప్పుకునేందుకు రాజకీయ పక్షాలు ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. ఇదే గ్రామంలో నాలుగో వార్డులో కూడా ఎస్సీకి రిజర్వ్ కాగా.. అక్కడ ఆ సామాజిక వర్గానికి చెందిన ఒక్క ఓటరు లేరు.

■ జడ్చర్ల మండలం శంకరాయపల్లి గ్రామపంచాయతీలో అందరూ బీసీలే ఉండగా.. సర్పంచ్ అభ్యర్థి రిజర్వేషన్‌ను ఎస్టీకి కేటాయించడంతో గందరగోళం ఏర్పడింది.

కేస్లీ తండాలో వింత పరిస్థితి..

నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని కేస్లీ తండాలో మొత్తం ఎస్టీ జనాభానే. మొత్తం 535 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ సర్పంచ్ స్థానాన్ని ఎస్టీ జనరల్‌తోపాటు 1, 2 వార్డులు (ఎస్సీ మహిళ), 3, 4 (ఎస్సీ జనరల్), 5, 8 (బీసీ మహిళ), 6 (అన్ రిజర్వ్‌డ్), ఏడో వార్డును బీసీ జనరల్‌కు కేటాయించారు. అయితే ఎస్సీ, బీసీ ఓటర్లు ఒక్కరూ కూడా లేరు. ఉన్న ఎస్టీలకూ ఒక్క వార్డు కేటాయించలేదు. దీనిపై ఎంపీడీఓను సంప్రదించగా ప్రింట్ మిస్టేక్ జరిగిందని.. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సరిచేయనున్నట్లు వెల్లడించారు.

పారదర్శక లోపమేనంటూ..

స్థానిక ఎన్నికలకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆయా జిల్లాలకు చెందిన ‘అధికార’ యంత్రాంగం సర్పంచ్ ఎన్నికల కోసం 2018 రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకుని రొటేషన్ పద్ధతిని అవలంబించింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు 2011 జనాభా లెక్కలు.. బీసీ రిజర్వేషన్లకు 2024 కుల గణన (తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే)ను ప్రామాణికంగా తీసుకుంది. ఈ మేరకు అధికారులు గ్రామపంచాయతీల్లో వార్డులు, సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. అయితే 2018లో తండాలను పంచాయతీలుగా మార్చిన క్రమంలో వంద శాతం గిరిజనులు ఉన్న వాటిని ఎస్టీలకు కేటాయించారు. ఒకటి, రెండు కుటుంబాలు ఉన్న పంచాయతీలను నాన్ ఎస్టీ కింద నోటిఫై చేశారు. దీంతో కొన్ని పంచాయతీల్లో అనివార్యంగా గానీ.. నామమాత్రపు పోటీతో గానీ పలువురికి సర్పంచ్ పదవులు దక్కే అవకాశం ఏర్పడింది. రిజర్వేషన్ల కేటాయింపుల్లో నిర్లక్ష్యం, పారదర్శకంగా వ్యవహరించకపోవడమే సమస్యలకు కారణమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రిటర్నింగ్ అధికారులదే కీలకపాత్ర



స్ట్రాంగ్ రూంలు, ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శంగా నిర్వహించడంలో రిటర్నింగ్ అధికారులదే కీలక పాత్రని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి వారి బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో రెండు విడతల్లో ఎన్నికలు జరుగుతాయని, అక్టోబర్ 9న మొదటి విడత, అక్టోబర్ 13న రెండోవిడత ఎన్నికల ప్రకటన విడుదల చేసే బాధ్యత రిటర్నింగ్ అధికారులదే అన్నారు. ఎన్నికల ప్రకటనను ఆర్‌ఓ కార్యాలయం, కలెక్టరేట్ నోటీసుబోర్డుపై ప్రదర్శించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ ప్రక్రియను వీడియో తీయాలని, పత్రంలో అభ్యర్థి ఏమైనా తప్పులు చేసినా, సంతకాలు లేకున్నా, తగిన ధ్రువపత్రాలు జత చేయకున్నా గుర్తించి సరి చేయించాలని, సాధ్యమైనంత వరకు తిరస్కరించకుండా చూడాలని ఆదేశించారు. ఏదైనా ధ్రువపత్రం జతచేయని పక్షంలో నిర్దిష్ట సమయంలో అభ్యర్థికి నోటీస్ జారీ చేయాలని, సకాలంలో ధ్రువీకరణ పత్రం సమర్పించని పక్షంలో మాత్రమే తిరస్కరించాలని ఆదేశించారు. నామినేషన్ వేసేందుకు అభ్యర్థి వెంట గదిలోకి ముగ్గురు కన్నా ఎక్కువ మంది వెళ్లడానికి వీలు లేదని వివరించారు. గుర్తింపు పొందిన పార్టీల గుర్తులు బి–ఫారం ఇచ్చిన అభ్యర్థులకు మాత్రమే కేటాయించి స్వతంత్ర అభ్యర్థులకు అభ్యర్థి పేరు తెలుగు అక్షరాలకు అనుగుణంగా కేటాయించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నియమావళి ప్రతి పేజీని చదువుకొని అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు యాదయ్య, ఎన్.ఖీమ్యానాయక్, ఆర్డీఓ సుబ్రమణ్యం, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలి..

స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు సమర్థవంతంగా పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో ఎన్నికల నియమావళి ప్రకారం నోడల్ అధికారులను నియమించినట్లు చెప్పారు. ప్రతి అధికారికి బాధ్యతలపై అవగాహన కల్పించి అప్పగించారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు..

స్థానిక సంస్థల బ్యాలెట్ బాక్సులను భద్రపర్చేందుకు స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లకై జిల్లాకేంద్రంలోని నూతన సమీకృత మార్కెట్ సముదాయం, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, రాజపేట సమీపంలోని ఐటిఐ, ఏటీసీ కేంద్ర భవనాలను పరిశీలించారు. అనువైన భవనాలను ఎంపిక చేసిన అనంతరం వాటిలో సీసీ కెమెరాలు బిగించాలని సూచించారు అదేవిధంగా ఓట్ల లెక్కింపునకు కావాల్సిన అన్ని సదుపాయాలతో పాటు బారికేడ్లు, పోలీసు భద్రత కల్పించాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్లు యాదయ్య, ఖీమ్యానాయక్, ఆర్డీఓ సుబ్రమణ్యం, వనపర్తి తహసీల్దార్ రమేష్‌రెడ్డి, జెడ్పీ సూపరింటెండెంట్ భానుప్రసాద్ తదితర అధికారులు ఉన్నారు.

తెలంగాణ పండుగ బతుకమ్మ



బతుకమ్మ సంబరాల్లో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పండుగ బతుకమ్మ అని కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో సెర్ప్, మెప్మా, జిల్లా సంక్షేమ శాఖలు సంయుక్తంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించాయి. ఈ వేడుకలకు కలెక్టర్, ఎస్పీ హాజరై తీరొక్క పూలతో తయారుచేసిన బతుకమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, చిన్నారులతో కలిసి బతుకమ్మ చుట్టూ ఆడి అందరిని ఉత్సాహపర్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమైన జిల్లాలో బతుకమ్మ సంబరాలు వాడవాడల ఘనంగా జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించగా ఉత్తమ బతుకమ్మలను ప్రదర్శించిన వారికి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి మెప్మా, రెండో బహుమతి పురపాలక, మూడో బహుమతి వ్యవసాయశాఖ, నాలుగో బహుమతి కలెక్టరేట్‌కు దక్కింది. వేడుకల్లో వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళలు, చిన్నారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయుధ పూజ నిర్వహించిన ఎస్పీ



ఆయుధ పూజ చేస్తున్న ఎస్పీ రావుల గిరిధర్ దంపతులు

వనపర్తి: శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో జిల్లా పోలీసులు సఫలీకృతం కావాలని, దుర్గాదేవి అనుగ్రహంతో విజయం వరించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం సాయుధ దళ పోలీసు కార్యాలయంలో ఎస్పీ, ఆయన సతీమణి అపర్ణ, అధికారులు, సిబ్బందితో కలిసి ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలు, వాహనాలకు ఎలాంటి ఆటంకం, అవరోధం కలగకుండా ఉండాలని బ్రాహ్మణులు వేదమంత్రోచ్చారణలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దుర్గామాత కరుణా కటాక్షాలు జిల్లా పోలీసులకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆయుధాలు, వాహనాలకు పూజలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సాయుధ దళ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు కృష్ణయ్య, రాంబాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, రిజర్వ్ సీఐలు శ్రీనివాస్, అప్పలనాయుడు, రిజర్వ్ ఎస్ఐలు వినోద్, సురేందర్, మొగ్దుంబారి, జిల్లాలోని ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం



వనపర్తిటౌన్: టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం జిల్లాకేంద్రంలో సీనియర్ క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకున్నట్లు రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాల్ తెలిపారు. అధ్యక్షుడిగా సూర్య చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా రామచంద్రమ్మ, కోశాధికారిగా ఈశ్వరమ్మ ఎన్నికైనట్లు వెల్లడించారు. అనంతరం కార్యవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బొలమోని కుమార్, కబడ్డీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి కురుమయ్య, వాలీబాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానం.. నిరుపయోగం

- కనిపించని క్రీడాసామగ్రి
- బీఆర్‌ఎస్ పాలనలో ఆగమేఘాల మీద ఏర్పాటు
- నీరుగారుతున్న లక్ష్యం.. పట్టించుకోని అధికార యంత్రాంగం
- నిరుత్సాహంలో యువత, విద్యార్థులు



మదనాపురం మండలం కొన్నూరులోని క్రీడా మైదానం

అమరచింత: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు జీవం పోయడంతో పాటు పల్లె క్రీడాకారుల నైపుణ్యాలను జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీలో క్రీడా మైదానం ఏర్పాటు చేసింది. ఇందుకోసం ప్రభుత్వం స్థలం కేటాయించడంతో పాటు రూ.5 లక్షలు మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన పూర్తి చేసింది. కాని చాలా గ్రామాల్లో క్రీడా మైదానాలు గ్రామాలకు దూరంగా గుట్టల ప్రదేశాల్లో ఉండటంతో నిరుపయోగంగా మారాయి. కొన్ని గ్రామాల్లో పాఠశాల మైదానాల్లో ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు కాస్త ఉపయోగంగా ఉన్నాయి. గ్రామాలకు దూరంగా ఉన్న క్రీడా మైదానాల నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. రాళ్లు రప్పలు తేలిన ప్రదేశాల్లో వీటికి సంబంధించిన సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు ఆ ప్రాంతాల్లో ఆటలు ఎలా ఆడుతారనే సంగతే మరిచారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని గ్రామాల్లో ఉన్న క్రీడా మైదానాల పరిస్థితి ఇదేవిధంగా ఉండటంతో ప్రస్తుతం ప్రభుత్వమైనా వీటిని వినియోగంలోకి తీసుకొచ్చి క్రీడాకారులకు ఉపయోగపడేలా సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

● క్రీడా మైదానాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టులను ఏర్పాటుచేసి వీటికి సంబంధించిన సామగ్రిని బిగించగా.. ప్రస్తుతం కనిపించకుండా పోయాయి. క్రీడాకారుల కోసం అన్నిరకాల క్రీడాసామగ్రి కిట్‌ను ఆయా గ్రామపంచాయతీలకు అప్పగించారు. అవి సైతం ఎక్కడా కనిపించడం లేదని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడం.. స్థల దాతలు ముందుకురాకపోవడంతో నిర్మాణాలు చేపట్టలేదు.

పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం..

నిర్వహణ లేకపోవడంతో క్రీడా మైదానాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో పాటు చెత్తా చెదారంతో నిండిపోయాయి. మరికొన్ని చోట్ల వ్యాయామం కోసం ఏర్పాటు చేసిన పరికరాలు సైతం కనిపించడం లేదు. గ్రామ సమీపంలో ఏర్పాటు చేయకపోవడంతో క్రీడాకారులు వీటిని వినియోగించుకునే పరిస్థితి లేక నిరుపయోగంగా మారాయి.

వినియోగంలోకి తీసుకొస్తాం..

గ్రామాల్లోని క్రీడా మైదానాల్లో సామగ్రి సమకూరుస్తాం. క్రీడాకారులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతాం. కొన్ని గ్రామాల్లో వసతులు లేవని తెలిసింది. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి క్రీడాకారులు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటాం.

– రఘునాథ్‌రెడ్డి, ఇంచార్జి డీపీఓ

వసతులు కల్పించాలి..



మండల కేంద్రంలో నిర్మించిన క్రీడా ప్రాంగణంలో వసతులు కల్పించాలి. వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేసినట్లు చెబుతున్న అధికారులు నెట్‌తో పాటు బాల్స్‌ను ఇవ్వడం లేదు. ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంతో అక్కడికి వెళ్లి ఆడలేని పరిస్థితి నెలకొంది.

– చిన్నపాగ భాను, వాలీబాల్ క్రీడాకారుడు, పాన్‌గల్

పట్టణంలో కరువు..



పట్టణంలోని పది వార్డుల్లో ఎక్కడా క్రీడా మైదానాలు ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న చిన్నపాటి ఖాళీ స్థలాల్లో క్రీడా మైదానాలు అంటూ సూచిక బోర్డులు ఏర్పాటు చేసి నిధులు దండుకున్నారు. కబడ్డీ, వాలీబాల్ ఆడే క్రీడాకారులకు సరైన మైదానాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

– బాలకృష్ణ, అమరచింత

మద్యం టెండర్ల ‘ఖాతా’ ప్రారంభం

- నాగర్‌కర్నూల్ జిల్లాలో మూడు టెండర్లు దాఖలు
- మిగిలిన జిల్లాల్లో నమోదు కాని టెండర్లు



నాగర్‌కర్నూల్ ఈఎస్ గాయత్రికి టెండర్ అందజేస్తున్న దరఖాస్తుదారుడు

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 227 మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానించగా మంగళవారం నాగర్‌కర్నూల్ ఈఎస్ పరిధిలో మూడు టెండర్లు దాఖలయ్యాయి. నాగర్‌కర్నూల్‌లో సర్కిల్ పరిధిలో ఉన్న రెండు దుకాణాలకు, కల్వకుర్తిలో ఒక దుకాణానికి టెండర్లు వచ్చాయి. అయితే ఈనెల 26 నుంచి ఉమ్మడి జిల్లాలో ఉన్న మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాగా ఇప్పటి వరకు మూడు మాత్రమే వచ్చాయి. మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, గద్వాల జిల్లాలో ఇంకా ఖాతా ఓపెన్ కాలేదు. ఈనెల 18 వరకు టెండర్ల స్వీకరణకు గడువు ఉన్న క్రమంలో మద్యం వ్యాపారులు ఆలస్యం చేస్తున్నారు. చివరి వారం రోజుల్లో టెండర్ల వేగం పుంజుకుంటుంది. రెండేళ్ల కాలపరిమితిలో వచ్చే మద్యం వ్యాపారులకు స్థానిక ఎన్నికలతో పాటు మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు కలిసి రానున్నాయి. దీంతో గతం కంటే ఈసారి టెండర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

క్లుప్తంగా

పొలం పనులకు వెళ్తూ రైతు మృతి



మిడ్జిల్: పొలంలో వ్యవసాయ పనులు చేసేందుకు వెళ్తూ రైతు మృతి చెందిన ఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన రాగుల బాలస్వామి (38) బుధవారం పొలంలో పంటకు మందు కొట్టేందుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో దారిలో వరి పొలంలో ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమి త్తం ఆస్పత్రికి తరలించారు.మృతుడికి భార్య మంజుల, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

మహమ్మదాబాద్: పొలం దున్నుతున్న సమయంలో ట్రాక్టర్ ఢీకొనడంతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పుట్టాపహాడ్‌కు చెందిన హన్మయ్య పొలంలో చిల్ల అంజయ్య(35) ఆదివారం రాత్రి మండల పరిధిలోని ఆముదాలగడ్డ తండాకు చెందిన హన్మ్యానాయక్‌తో ట్రాక్టర్‌తో దున్నిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు వెనుక ఉన్న అంజయ్యకు ట్రాక్టర్ తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతానికి యువకుడి బలి



మధుసూదన్ యాదవ్ (ఫైల్)

పాన్‌గల్: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మధుసూదన్‌యాదవ్ (28) విద్యుత్ శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి (స్పాట్ బిల్లర్)గా విధులు నిర్వహిస్తున్నాడు. సబ్‌స్టేషన్ సమీపంలో రైతుల పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్య ఉందని ఆ ప్రాంత రైతులు తెలుపడంతో దానిని సరిచేసేందుకు మంగళవారం సాయంత్రం వెళ్లాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడ్డాడు. ఏకైక కుమారుడు అకాల మరణం చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా.. ఫిర్యాదు అందలేదన్నారు.

పాముకాటుతో బాలుడి మృతి



అభిరామ్(ఫైల్)

ఎర్రవల్లి: పాము కాటుకు గురై బాలుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొండపేట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన అభిరామ్ (9) ఇంటి పరిసరాల్లో ఆడుకుంటుండగా పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బాలుడిని గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు: వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ రెండో ఎస్ఐ భూపాల్ కథనం ప్రకారం.. హన్వాడ మండలం బుద్దారానికి చెందిన కమ్మరి రంగాచారి(36) మంగళవారం జడ్చర్లలో ఉన్న తమ్ముడు, తండ్రిని కలిసి తిరిగి బైక్‌పై మహబూబ్‌నగర్ వస్తుండగా మార్గమధ్యంలో తిరుమలహిల్స్ సమీపంలో ఆర్టీసీ బస్సు వెనకనుంచి బైక్‌ను ఢీకొట్టింది. కిందపడిన రంగాచారి పైనుంచి బస్సు వెనుక టైర్లు పోవడంతో తొడ భాగం పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరూ కూతుర్లు, కొడుకు ఉన్నారు. భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెక్కీ చేసి దోచేశారు..!

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్‌లో జరిగిన దొంగతనం కేసులో మూడు బృందాలుగా ఏర్పడి పోలీసులు మంగళవారం విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు.. గణేష్‌నగర్‌కు చెందిన నాగేశ్వర్‌రెడ్డి కుటుంబంతో కలిసి ఈ నెల 27న తిరుపతి దర్శనానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఈ నెల 29 తెల్లవారు జామున దొంగలు ఇంట్లోకి ప్రవేశించి దొంగతనం చేశారు. ఉదయం పని మనిషి ఇళ్లు శుభ్రం చేయడానికి వచ్చిన సమయంలో ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో యాజమానికి సమాచారం ఇచ్చింది. బాధితుడు అతని అన్న రాజేశ్వర్‌రెడ్డికి సమాచారం ఇవ్వగా, అతను ఇంట్లో పరిశీలించగా 4 కేజీల వెండి, రూ.20 వేల నగదు అపహరించినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు, సీసీఎస్, ఫింగర్ ప్రింట్ బృందాలు విచారణ చేపట్టి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వాహనాన్ని గుర్తించారు. కేసు విచారణలో ఉందని త్వరలో నిందితులను పట్టుకుంటామని సీఐ అప్పయ్య పేర్కొన్నారు.



అలంపూర్‌లో పల్లకీ సేవలో పాల్గొన్న ఈఓ దీప్తి



అలంపూర్‌లో పట్టువస్త్రాలతో కర్నూలు కలెక్టర్ సిరి



అలంపూర్‌లో కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు

సిద్ధిధాత్రి.. కరుణించమ్మా



అలంపూర్‌లో జోగుళాంబ అమ్మవారి ఆలయంలో భక్తుల పూజలు

- తొమ్మిదో రోజు సిద్ధిధాత్రిగా జోగుళాంబ
- పట్టువస్త్రాలు సమర్పించిన కర్నూలు కలెక్టర్
- రమణీయంగా జోగుళాంబ అమ్మవారి రథోత్సవం
- ఆకట్టుకున్న కూచిపూడి సాంస్కృతిక కార్యక్రమాలు

అలంపూర్: సకల సిద్ధులు ప్రసాదించే సిద్ధిధాత్రి నమోస్తుతే అంటూ భక్తులు జోగుళాంబ అమ్మవారిని శరణు కోరారు. అలంపూర్ క్షేత్రంలో వెలిసిన జోగుళాంబ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శరన్నవరాత్రి ఉత్సవాల తొమ్మిదోరోజు మంగళవారం జోగుళాంబ అమ్మవారు సిద్ధిధాత్రి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరూపాల్లో చివరిరోజు సిద్ధిధాత్రిగా దర్శనమిచ్చి అమ్మవారిని ప్రత్యేక మండపంలో కొలువుదీర్చారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు అమ్మవారికి కుమారి పూజ, సువాసినిపూజ, మంత్రపుష్ప నీరాజనం, దశవిధ హారతులను అందజేశారు. శరన్నవరాత్రుల్లో చివరిరోజు జోగుళాంబ అమ్మవారిని సిద్ధిధాత్రిగా ఆరాధిస్తారని అర్చక స్వాములు తెలిపారు. సకల సిద్ధులను ప్రసాదించే ఆ జగన్మాత సిద్ధిధాత్రిగా దర్శనమిస్తూ భక్తుల కోరికలను తీరుస్తుందని భక్తులకు ప్రగాఢ విశ్వాసంగా తెలిపారు. నవదుర్గలలో ఒకరైన సిద్ధిధాత్రిని ఆరాధించడంతో శరన్నవరాత్రుల శుభ ఫలితాలు కలుగుతాయని భక్తులకు వివరించారు. ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీబాలబ్రహ్మేశ్వర స్వామి జోగుళాంబ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. కుంకుమార్చనలు, చండీహోమాలు, అభిషేకాలు, అర్చనలు, నిత్యహోమాలు, శ్రీచక్రార్చనలు, ఖడ్గమాల అర్చనలు, నవారణ అర్చనలు ప్రత్యేకంగా జరిగాయి. అనంతపూర్‌కు చెందిన అమృత కూచిపూడి డ్యాన్స్ అకాడమీకి చెందిన కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

క్షేత్రంలో రథోత్సవం

దసర ఉత్సవాల్లో భాగంగా జోగుళాంబ అమ్మవారి రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో రథాన్ని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. అనంతరం జోగుళాంబ మాత ఉత్సవ విగ్రహాన్ని రథంలో కొలువుదీర్చారు. అర్చక స్వాములు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చక స్వాములు గుమ్మడికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. క్షేత్ర దర్శనానికి వచ్చిన భక్తులు అమ్మవారికి జేజేలు పలుకుతూ రథాన్ని ముందుకు నడిపించారు. రథోత్సవ కార్యక్రమాన్ని వీక్షించడానికి భక్తులు పెద్దసం



రథానికి పూజలు చేస్తున్న అర్చకుడు

ఖ్యలో హాజరయ్యారు.

ఏపీ ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు

జోగుళాంబ అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలకు ఏపీ ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను కర్నూల్ కలెక్టర్ సిరి అందజేశారు. ప్రతి ఏడాది నవరాత్రి ఉత్సవాల్లో ఏపీ ప్రభుత్వం అమ్మవారికి పట్టువస్త్రాలను అందజేయడం అనవాయితీ. అందులో భాగంగా కర్నూల్ కలెక్టర్ సిరి, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ సుధాకర్‌రెడ్డి అలంపూర్ క్షేత్రానికి చేరుకున్నారు. ఈఓ దీప్తి వారికి స్వాగతం పలికారు. పట్టువస్త్రాలను శిరస్సున ధరించి అమ్మవారి ఆలయానికి చేరుకొని పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివారి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు వారిని శేషవస్త్రాలతో సత్కరించారు. అర్చక స్వాములు తీర్థప్రసాదాలను అందజేసి వేదాశీర్వచనం చేశారు. వీరితోపాటు పాలక మండలి సభ్యులు, భక్తులు తదితరులు ఉన్నారు.

'అక్రమ బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీపై పోరాటం'



మాట్లాడుతున్న తెలంగాణ నిరుద్యోగ రక్షణ జేఏసీ చైర్మన్ మహిపాల్‌యాదవ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా బ్యాక్‌లాగ్ ఉద్యోగులను భర్తీ చేస్తున్నారని.. ఆ అక్రమ భర్తీపై నిరుద్యోగ రక్షణ జేఏసీ పోరాటం చేస్తుందని తెలంగాణ నిరుద్యోగ రక్షణ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మహిపాల్‌యాదవ్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిరుద్యోగులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులను కొంతమంది ఆయా శాఖ ఉన్నాధికారులు అక్రంగా నియామించారని, ఆ నియామకాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ పోరాటంతో అక్రమ నియామకాల ప్రక్రియ ప్రస్తుతానికి నిలిపివేశారన్నారు. అక్రమ నియామకాలతో నిజమైన నిరుద్యోగులు నష్టపోతున్నారని, వారి తరఫున తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ శాఖల్లో పేరుకుపోయిన అవినీతితో రాష్ట్రం అధోగతి పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దొడ్డిదారిలో నియామకాలను అడ్డుకుని నిరుద్యోగులకు న్యాయం చేయడానికి ప్రయత్నిస్తున్న తనపై బెదిరింపులకు దిగుతున్నారని, ఆ బెదిరింపులకు ఏమాత్రం భయపడకుండా నిరుద్యోగ పక్షాన నిలబడి పోరాటం చేస్తానన్నారు. అక్రమ నియామకాలను ఆపే వరకు జేఏసీ పోరాటం ఆపదన్నారు. అక్రమ నియామకాలపై ప్రభుత్వం స్పందించి వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో తెలంగాణ నిరుద్యోగ రక్షణ జేఏసీ నాయకులు రామకృష్ణ, మహేశ్, నరేందర్, ఆంజనేయులు, రాజు పాల్గొన్నారు.

జూరాలకు 4.66 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



జూరాల 31 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

- స్వల్పంగా తగ్గిన వరద
- ప్రాజెక్టు 31 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 4.62 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

ధరూరు: ఎగువ నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి 8 గంటలకు ప్రాజెక్టుకు 5.37 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం రాత్రి 8.30 గంటల వరకు 4.66 లక్షల క్యూసెక్కులకు తగ్గినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ప్రాజెక్టు 31 క్రస్టు గేట్లను ఎత్తి 4.62లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జెన్కో జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 37 క్యూసెక్కులు, కుడి కాల్వకు 220 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 4,62,703 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 6.604 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

కోయిల్‌సాగర్‌లో....

దేవరకద్ర: మండలంలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టు రెండు గేట్లను తెరిచి నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు పెద్దవాగు నుంచి ఇన్‌ఫ్లో ప్రాజెక్టుకు చేరుతోంది. శనివారం భారీగా వచ్చిన వరదతో ప్రాజెక్టు 7 గేట్లను ఎత్తి నీటిని వదిలారు. ఆదివారం మూడు గేట్లను, సోమవారం, మంగళవారం రెండు గేట్లను ఒక అడుగు మేర ఎత్తి 1,500 క్యూసెక్కుల నీటిని వాగులోకి వదుతున్నారు.

సుంకేసులకు తగ్గిన ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు మంగళవారం ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి 29,114 క్యూసెక్కులు రాగా.. 5 గేట్లను ఒక మీటర్ మేర తెరిచి 25,747 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,012 క్యూసెక్కుల నీటిని వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు నిలకడగా వరద

దోమలపెంట: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు వరద నిలకడగా కొనసాగుతుంది. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు 31 గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 4,62,448, సుంకేసుల నుంచి 30,736, హంద్రీ నుంచి 10,300 మొత్తం 5,03,484 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలం పది గేట్లు ఒక్కొక్కటి 23 అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 5,76,940, కుడి, ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ అదనంగా 64,211 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 883.1 అడుగుల వద్ద 205.2258 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గడిచిన 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 5,000, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,063 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమ భూగర్భ కేంద్రంలో 16.111 మిలియన్ యూనిట్లు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 14.590 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.



రోడ్డుప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- అదుపుతప్పిన బైకు.. యువకులపై వెళ్లిన వాహనం
- శాఖాపూర్ వద్ద ఎన్‌హెచ్–44పై దుర్ఘటన
- యువకులు వనపర్తి జిల్లా వాసులే..

అడ్డాకుల: 44వ నంబర్ జాతీయ రహదారి మరోసారి నెత్తురోడింది. బైక్‌పై వెళ్తున్న యువకులు అదుపుతప్పి కిందపడగా.. వారిపైనుంచి వెనకాలే వస్తున్న వాహనం దూసుకెళ్లడంతో శరీరాలు ఛిద్రమై అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన అడ్డాకుల మండలం శాఖాపూర్ వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం చర్లపల్లికి చెందిన యువకుడు గణేశ్(20), ఖిల్లాఘనపురం మండలం అప్పారెడ్డిపల్లికి చెందిన రాజు(21) పల్సర్‌పై కొత్తకోట వైపు నుంచి హైవేపై వెళ్తున్నారు. శాఖాపూర్ వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డుపై పడ్డారు. వారి వెనుకే వస్తున్న గుర్తు తెలియని వాహనం యువకుల పైనుంచి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరి శరీరాలు ఛిద్రమై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. యువకులపై నుంచి వెళ్లిన వాహనం అక్కడి నుంచి తప్పించుకుపోయింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలింపు చేపట్టారు. ఇద్దరు యువకుల మృతదేహాలను జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుల్లో రాజు చర్లపల్లికి చెందిన యువతితో వివాహమై అక్కడే ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వారికి కూతురు ఉంది. అదేవిధంగా గణేశ్ మత్స్యకారుడిగా పని చేస్తుండగా వివాహం కాలేదని సమాచారం. కాగా ఇద్దరు యువకులు బైక్‌పై ఎక్కడికి వెళ్తున్నారన్న విషయం తెలియరాలేదు. ప్రమాదఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.





జంగిల్ సఫారీ పునఃప్రారంభం



అటవీ లోతట్టు ప్రాంతంలోని వ్యూ పాయింట్ వద్ద పర్యాటకులు (ఫైల్)

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో జంగిల్ సఫారీ బుధవారం పునఃప్రారంభం అవుతుందని మన్ననూర్ ఎఫ్ఆర్ఓ వీరేష్ తెలిపారు. వన్యప్రాణుల బ్రీడింగ్ సమయం అయినందున వాటి స్వేచ్ఛను దృష్టిలో ఉంచుకొని మూడు నెలలపాటు (జూలై, ఆగస్టు, సెప్టెంబర్) సఫారీ మూసి ఉంచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్టోబర్ 1వ తేదీ మొదలుకొని ప్రతినిత్యం సఫారీ వాహనాలు సంబంధిత అటవీశాఖ అధికారులు నిర్దేశించిన ప్రాంతాలలో తిరుగుతాయని పేర్కొన్నారు. పర్యాటకులు సఫారీలో ఉన్న క్రమంలో సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ప్రతి వాహనం వెంట అనుభవజ్ఞులైన నేచర్ గైడ్స్ ఒకరు అందుబాటులో ఉండి వన్యప్రాణులు, అరుదైన వృక్షజాలం గురించి వివరిస్తారని చెప్పారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అడవులు ఆకుపచ్చ రంగులో ఆహ్లాదంగా ఉండటంతోపాటు అధికంగా పెరిగిన వన్యప్రాణులు ముఖ్యంగా పెద్దపులులు దారిలో కనిపించి సఫారీ ట్రిప్ పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయని పేర్కొన్నారు. ఫర్హాబాద్, గుండం, అక్కమ్మదేవి గుహలు వంటి నిర్ణీత ప్రదేశాలలో సఫారీ ప్రయాణం కొనసాగుతుందన్నారు. సఫారీ వేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని, సఫారీ రైడ్ కోసం ఒకరు రూ.2 వేల చొప్పున చెల్లించాలన్నారు. వాహనంలో ఏడుగురికి మాత్రమే అనుమతి ఉంటుంది. సఫారీ ప్రయాణం చేయాలనుకునేవారు జ్టీ ఇటః //ౖరఝట్ప ఛ్చీజీజ్చటట్పటటౌ.ఛొౌఝ/ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. సఫారీ ట్రిప్‌లో ఉన్న పర్యాటకులు ప్లాస్టిక్, చెత్తాచెదారం అటవీ ప్రాంతంలో వేయకూడదని, అలాగే వన్య ప్రాణులకు ఎలాంటి ఆహారం అందించకూడదని కోరారు.



అటవీ ప్రాంతంలో జంగిల్ సఫారీ వాహనం (ఫైల్)

వరద ఉధృతికి కొట్టుకుపోయిన ఎద్దుల బండి


- రెండు ఆవులు మృతి. ప్రాణాలతో బయటపడ్డ దంపతులు

కోడేరు: వాగు ఉధృతికి రెండు ఎద్దులు మృతి చెందగా భార్యాభర్తలు ప్రాణపాయం నుంచి బయటపడిన ఘటన కోడేరు మండలం నాగులపల్లిలో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలిలా.. గ్రామానికి చెందిన బోయ జక్కుల వెంకటస్వామి అతని భార్య అడివమ్మ ఉదయం రెండు ఆవులను బండికి కట్టుకొని వాగును దాటుతూ వ్యవసాయ పొలానికి వెళ్తున్నారు. ఉధృతంగా వాగు ప్రవహించడంతో బండి గుంతలో ఇరుక్కుపోయింది. రెండు ఎద్దులు అక్కడిక్కడే మృతిచెందాయి. భార్యాభర్తలు ఇద్దరు చెట్లను పట్టుకొని బయటకు వచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చనిపోయిన ఆవులను తాళ్ల సహాయంతో బయటకు తీశారు. దాదాపు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని బాధితులు రోదించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు.



చనిపోయిన ఆవులను బయటకు తీస్తున్న గ్రామస్తులు

వాగులో యువకుడు గల్లంతు



వాగులో చెట్టును పట్టుకొని ఉన్న మహిళను రక్షిస్తున్న స్థానికులు



గాలింపు చర్యల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- గజ ఈతగాళ్లు గాలించిన దొరకని ఆచూకీ
- తాళ్ల సాయంతో మహిళను కాపాడిన స్థానికులు

దేవరకద్ర రూరల్: ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటేందుకు ప్రయత్నించిన ఘటనలో వ్యక్తి గల్లంతు కాగా, స్థానికుల సాయంతో మహిళ ప్రాణాలతో బయటపడిన సంఘటన మంగళవారం కొకుంట్ల మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఇస్రంపల్లికి చెందిన అలివేలు, మంగళి రమే ష్ (30) పనుల నిమిత్తం కొకుంట్లకు వెళ్తున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి రెండు గ్రామాల మధ్య ఉన్న కల్వర్టుపై నీరు ఉధృతంగా పవహిస్తుంది. అధికారులు వారిస్తున్నా.. వాగు దాటేందుకు ప్రయత్నించడంతో నీటి ప్రవాహానికి వాగులో కొట్టుకుపోయారు. ఈ క్రమంలో అలివేలమ్మ వాగు లో ఉన్న ఓ చెట్టును పట్టుకొని ఉండటంతో గమనించిన స్థానికులు తాళ్ల సాయంతో కాపాడగా, రమేష్ గల్లంతయ్యాడు. అధికారులకు సమాచారం అందడంతో ఎస్‌డీఆర్‌ఎఫ్ గజ ఈతగాళ్లతో గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడం, చీకటి కావడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. కాగా నిన్న ఇదే బ్రిడ్జిపై ఇస్రంపల్లికి చెందిన యువకుడు దాటేందుకని ప్రయత్నించి వాగులో కొట్టుకపోగా కొకుంట్లకు చెందిన మల్లేష్ ప్రాణాలకు తెగించి కాపాడాడు. ఈ సంఘటనతో అధికారులు ఎవ్వరూ వాగు దాటకుండా రెండు వైపులా చర్యలు తీసుకున్నారు.

గాలింపు చర్యలు పర్యవేక్షించిన ఎమ్మెల్యే

వాగులో వ్యక్తి గల్లంతైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.